సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 26 । జూన్ । 2023



రూ.2,50,116 విరాళాలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి డీఆర్‌పీ వర్మ (హైదరాబాద్) రూ.1,00,116, టి.వరలక్ష్మి (పిఠాపురం) రూ.1,50,000 చొప్పున ఆదివారం విరాళాలు సమర్పించారు.



రూ.లక్ష సమర్పణ

పిఠాపురం: గొల్లప్రోలు కరణంగారి తోటలో కనకదుర్గమ్మ ఆలయ పునర్నిర్మాణానికి పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం 32.5°/24.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	32.5	24.0
కాకినాడ	32.1	24.2
అమలాపురం	32.0	26.0

న్యూస్‌రీల్

కళ్లు చెదిరేలా.. భక్తి ఉప్పొంగేలా..



తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారు భక్తిభావన మరింత ఉప్పొంగేలా.. కళ్లు చెదిరేలా.. మట్టిగాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం తొలి ఆదివారం కావడంతో వివిధ రకాల మట్టి గాజులతో అమ్మవారిని విశేషంగా అలంకరించామని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. నిండుముత్తయిదువు అలంకరణలో ఉన్న అమ్మవారిని వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఆనందంతో దర్శించారు.

పోటెత్తిన భక్తులు



లోవలో భక్తులు, వాహనాల రద్దీ

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి సన్నిధికి భక్తులు పోటెత్తారు. ఆషాఢ మాసం తొలి ఆదివారం కావడంతో వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. క్యూలైన్ల ద్వారా 30 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాద విక్రయాల ద్వారా రూ.3,37,320, పూజా టిక్కెట్లకు రూ.2,90,250, కేశఖండనశాలకు రూ.20,375, వాహన పూజలకు రూ.6,350, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.1,15,712, విరాళాలుగా రూ.2,39,628 కలిపి మొత్తం రూ.10,09,635 ఆదాయం సమకూరిందని వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో దేవస్థానంలో వసతి గదులు నిండుకున్నాయి. దీంతో వేలాదిగా భక్తులు ఆలయ ప్రాంగణంలో చెట్ల కింద, ఘాట్ రోడ్డు దిగువన ప్రైవేట్ కాటేజీల్లోను వసతి ఏర్పాటు చేసుకుని వంటలు, భోజనాలు చేశారు. రూరల్ సీఐ ఆధ్వర్యాన తుని పట్టణ సీఐ, తుని రూరల్, కోటనందూరు ఎస్సైలతో సహా 40 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


రత్నగిరికి భక్తుల తాకిడి



వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి ఆదివారం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తులు సత్యదేవుని ఆలయానికి వస్తూనే ఉన్నారు. స్వామివారి దర్శనం క్యూ లైన్లు, ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంత మండపాలు భక్తులతో నిండిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. వ్రతాలు 3,500 జరిగాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో 4 వేల మందికి భోజనం పెట్టారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ పర్యవేక్షించారు.

డెల్టాలకు 5,730 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు ఆదివారం 5,730 క్యూసెక్కుల గోదావరి జలాలను వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.55 అడుగులకు చేరింది.

అన్న మాటకు కట్టుబడి

- 28న తల్లుల ఖాతాల్లో 'అమ్మ ఒడి' సొమ్ము జమ
- సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితా
- నేడు, రేపు పేరెంట్స్ టీచర్స్ కమిటీ సమావేశాలు
- జిల్లాలో గతేడాది 1.45 లక్షల మందికి రూ.218.193 కోట్ల జమ



రాయవరం: చదువుల విప్లవం ఇది.. చరిత్రలో సగర్వంగా చెప్పుకొనే రోజులు ఇవి.. 'అన్న'మాటను అక్షరాలా నిజం చేసిన సంక్షేమ సంతకమిది.. పేదల ఇంట విద్యా దివ్వెలు వెలిగించిన సువర్ణాధ్యాయమిది.. చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే మహా సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో 'జగనన్న అమ్మ ఒడి' పథకం పురుడు పోసుకుంది.. ప్రతి విద్యార్థి ఇంట సంక్షేమ బాట పడింది.

జిల్లాలో జగనన్న అమ్మఒడి పథకం కింద 2019–20 విద్యా సంవత్సరం నుంచి లబ్ధిదారుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం సొమ్ము జమ చేస్తుంది. నాలుగో ఏటా సొమ్ము జమ చేసేందుకు అన్ని చర్యలు చేపట్టింది. ఇందులో అర్హులందరికీ న్యాయం జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో అర్హుల జాబితాలు సచివాలయాలకు శనివారం రాత్రి పంపించింది. జిల్లాలో గత ఏడాది ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదువుకున్న విద్యార్థులలో 1,45,462 మంది అమ్మ ఒడి ద్వారా లబ్ధి పొందారు. ఈ ఏడాది కూడా రిమార్కులు ఉన్న లబ్ధిదారుల జాబితాల సచివాలయాల పరిధిలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు నెల రోజుల కిందట వెరిఫికేషన్ చేశారు. దీంతో అర్హుల జాబితా సచివాలయాలకు చేరింది.

ప్రతి విద్యార్థి చదువుకోవాలని..

ఏ ఒక్క పేద విద్యార్థి ఆర్థిక భారంతో చదువుకు దూరం కాకూడదనేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన. గతంలో అనేక మంది పేదలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ చిన్నారులను బడికి పంపేవారు కాదు. బడికి పంపిస్తే ఫీజులు, పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్ తదితర అవసరాలకు అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు జగనన్న విద్యా కానుక పేరుతో స్కూల్ బ్యాగ్‌తో సహా అన్ని వస్తువులను ప్రభుత్వమే అందజేస్తోంది. ఈ ఏడాది కూడా పాఠశాలల పునః ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుకలను విద్యార్థులకు ఇచ్చింది. ప్రజాసంకల్ప యాత్రలో పేదల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసిన సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి విద్యార్థి పేదరికంతో చదువుకు దూరం కాకూడదన్న సంకల్పంతో అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా పాఠశాలకు చిన్నారులను పంపించే అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.13 వేలను ప్రభుత్వం జమ చేస్తుంది. ఇది లక్షలాది కుటుంబాల్లో విద్యా వెలుగులు నింపుతోంది.

నేరుగా తల్లుల ఖాతాలకే..

అమ్మ ఒడి పథకంలో సొమ్మును నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. ఆధార్ కార్డుతో అనుసంధానం చేసిన బ్యాంకు అకౌంట్‌లో ఈ డబ్బులు జమవుతున్నాయి. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు ఆధార్ లింక్ అయిన అకౌంట్లకు మాత్రమే అమ్మఒడి నగదు నేరుగా జమ చేస్తారు. కచ్చితంగా తల్లికి, తల్లి మరణించిన, దూరప్రాంతాల్లో సంరక్షకుల వద్ద ఉంటున్న వారికి అకౌంట్లు ఆధార్ అనుసంధానమై ఉండాలి. ఈకేవైసీ చేసుకోకపోవడంతో గతంలో కొంతమందికి సొమ్ము జమ కాలేదు. గతేడాది ఇటువంటి సమస్యలపై ప్రభుత్వం ఫోకస్ చేసింది. అర్హులందరికీ అమ్మ ఒడి పథకం అందించేలా సచివాలయ స్థాయిలో విద్యా వెల్ఫేర్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించింది.

అర్హతలు ఇవే..

అర్హులు తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండాలి. అప్పుడే ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాలల్లో చదివే చిన్నారులకు అమ్మ ఒడి పథకం వర్తిస్తుంది. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులకు అమ్మఒడి సాయంగా రూ.15 వేలు అందజేస్తారు. ఈ మొత్తంలో పాఠశాలల టాయిలెట్స్ నిర్వహణకు రూ.2 వేలు మినహాయించి, మిగిలిన రూ.13 వేలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తారు. మూడేళ్లుగా అమ్మఒడిని అమలు చేస్తూ.. నాలుగో ఏట కూడా అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 28న అమ్మఒడి సొమ్ము జమ చేస్తారు.

నేటి నుంచి సమావేశాలు

అమ్మ ఒడి పథకాన్ని ఈ నెల 28న అమలు చేయనున్న నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో పేరెంట్స్ టీచర్స్ కమిటీ సమావేశాలను ప్రధానోపాధ్యాయులు నిర్వహించాలి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ సమావేశాల అమలుకు క్షేత్ర స్థాయికి ఆదేశాలు జారీ చేసింది. అమ్మ ఒడిలో భాగస్వాములైన తల్లులందరినీ ప్రధానోపాధ్యాయులు సమావేశానికి పిలవాల్సి ఉంది. ఆ సమావేశాల్లో ఈ నెల 20న జరిగిన జగనన్న ఆణిముత్యాలు వీడియోను తల్లులకు చూపించాలి. అలా వీలుకాకుంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని తల్లులకు చదివి వినిపించాలి. రాష్ట్రంలో విద్యాపరంగా ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న అమ్మ ఒడి, మనబడి నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్, స్కూల్ మేనేజ్‌మెంట్ ఫండ్, 3–10 తరగతులకు సబ్జెక్టు టీచర్ల నియామకం, అఫిలియేషన్ టు సీబీఎస్ఈ, విద్యాపరమైన సంస్కరణలు, టీచర్ కెపాసిటీ బిల్డింగ్, ప్రతి మండలంలో బాలికలకు ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల ఏర్పాటు, డిజిటల్ లెర్నింగ్, పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం తదితర వివరాలను వివరించాల్సి ఉంటుంది.

జిల్లాలో అమ్మఒడి పథకం లబ్ధి ఇలా.. (రూ.కోట్లు)

సంవత్సరం	అర్హులైన తల్లులు	జమచేసిన సొమ్ము
2019-20	1,37,994	206.991
2020-21	1,44,797	217.196
2021-22	1,45,465	218.193

కచ్చితంగా సమావేశాల నిర్వహణ



అమ్మ ఒడి కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో కచ్చితంగా పేరెంట్స్ టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి. ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రధానోపాధ్యాయులు సమావేశాల్లో వివరించాలి. దీనిపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఆదేశాలు జారీ చేస్తాం. దానికి అనుగుణంగా నడుచుకోవాలి.

– ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

చదువుకు ఆర్థిక భరోసా



ప్రభుత్వం ఏటా అమ్మ ఒడి పథకం కింద ఆర్థిక సాయాన్ని నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ ఏడాది నాల్గవ విడత సొమ్మును అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. అమ్మ ఒడి పథకం పేద విద్యార్థులకు, వారి తల్లులకు ఆర్థిక భరోసా ఇస్తోంది. ఈ నెల 26, 27 తేదీల్లో పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి.

– జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

బస్సు చార్జీల్లో 10 శాతం రాయితీ

దూర ప్రాంత ప్రయాణికులకు సౌలభ్యం



సత్యనారాయణ మూర్తి

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి విజయవాడ, విశాఖపట్టణం, బత్తిలి, శ్రీశైలం, తిరుపతి, హైదరాబాద్ బస్సు సర్వీసులకు రాయితీలు కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి ఆదివారం తెలిపారు. ఈ దూర ప్రాంతాల సర్వీసుల్లో ప్రయాణించే వారికి రానూ పోనూ ఒకేసారి అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకుంటే రెండు టిక్కెట్లపై చార్జీలో 10 శాతం రాయితీ ఉంటుందన్నారు. అమలాపురం– బీహెచ్‌ఈఎల్ సూపర్ లగ్జరీకి రూ.160, అమరావతి ఏసీ సర్వీసుకు రూ.260, నైట్ రైడర్‌కు రూ.100, నైట్ రైడర్ బెర్త్‌కు రూ.260, అమలాపురం– శంషాబాద్ ఇంద్రా బస్సుకు రూ.200, అమలాపురం– విశాఖపట్నం ఇంద్రా బస్సుకు రూ.100, అమలాపురం– విశాఖపట్టణం సూపర్ లగ్జరీ బస్సుకు రూ.50, అమలాపురం– విజయవాడ ఇంద్రా బస్సుకు రూ.80, అమలాపురం– విజయవాడ సూపర్ లగ్జరీ బస్సుకు రూ.60 రాయితీగా లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని డీఎం మూర్తి కోరారు.

కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమ పూజల్లో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. అభిషేక పూజల్లో 57 మంది, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 379 మంది, శ్రీలక్ష్మి గణపతి హోమంలో 26 మంది, వినాయకస్వామికి ప్రత్యేక అభిషేకంలో 21 మంది దంపతులు పాల్గొని పూజలు చేశారు. తొమ్మిది మంది చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాసన, తులాభారం వంటివి నిర్వహించారు. 31 మంది తమ నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,28,648 సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

పవన్‌కల్యాణ్‌కు ఎల్లో వైరస్ సోకింది

- అవగాహనా రాహిత్యంతో వ్యాఖ్యలు తగవు
- ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు రామారావు

అల్లవరం: కొబ్బరికి తెల్లదోమ పట్టినట్టే.. రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ నాయకులకు తెల్లదోమ పట్టిందని అమలాపురంలో జరిగిన వారాహి యాత్రలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు చేయడంపై ఏపీ అగ్రిమిషన్ సభ్యుడు జున్నూరి రామారావు ఆదివారం స్పందించారు. డి.రావులపాలెంలోని తన నివాసంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. కేరళ నుంచి జమ్మూ కశ్మీర్ వరకూ కొబ్బరి, ఉద్యాన పంటలకు తెల్లదోమ సోకితే వాటి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్వేషిస్తున్నాయన్నారు. పవన్‌కు సోకిన ఎల్లో వైరస్‌కు మందు లేదని గ్రహించాలని రామారావు అన్నారు. కేంద్రంతో సొత్తు పెట్టుకున్న పవన్ ఎప్పుడూ తెల్లదోమ నివారణపై బీజేపీ దృష్టికి తీసుకెళ్లలేదని, కొబ్బరి రైతుల సమస్యలకు పరిష్కారం చూపలేదని అన్నారు.



జున్నూరి రామారావు

జిల్లాలో ముంపు సమస్యతో రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారని పవన్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో అల్లవరం మండలం బెండమూర్లంకలో క్రాప్ హాలిడే ఉద్యమం నిర్వహిస్తే.. ఆ రైతులను ఏవిధంగా చంద్రబాబు ఆదుకున్నారో పవన్‌కళ్యాణ్ చెప్పాలని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు ఉద్యమాలు చేయకుండా సెక్షన్ 30ని అమలు చేసి రైతు ఉద్యమాన్ని నీరుగారిస్తే పవన్ ఎందుకు ప్రశ్నించలేదని అని అడిగారు. రైతుల పోరాటాన్ని అణగదొక్కిన వ్యక్తికి పవన్‌కల్యాణ్ మద్దతు ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పంట విరామ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ జగన్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించి రైతుల సమస్యలకు పరిష్కారం చూపడానికే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చేశారని గుర్తుచేశారు. ఇరిగేషన్, డ్రైనేజీ కార్యాలయాలను జిల్లా కేంద్రానికి తరలించి రైతులకు అందుబాటులో ఉంచారని రామారావు తెలిపారు. ముంపు నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించి, సాత్ అద్దాల, చించుల, బెండానార్త్, శిరగట్లపల్లి డ్రెయిన్‌లను ఆధునీకరించారని, పీకలేరు, రంగరాజు కోడు, సంఘం వుంత డ్రెయిన్‌లకు, గోదావరి డెల్టా ఆధునీకరణకు రూ.150 కోట్ల నిధులు కేటాయించారని, ఏరువాక కేంద్రాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. ప్రాధాన్య క్రమంలో కాలువలన్నీ ఆధునీకరించి ముంపు సమస్య లేకుండా చూడడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు పవన్‌కల్యాణ్ ఏం చేస్తారో చెప్పకుండా, వైఎస్సార్ సీపీ నేతలను తిట్టడానికే వారాహి యాత్ర నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలకు ప్రతి నెలా రూ.5 వేలు

- ధూపదీప నైవేద్య పథకం వర్తింపుపై హర్షం
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

అమలాపురం టౌన్: ధూపదీప నైవేద్య పథకాన్ని ఇక నుంచి రాష్ట్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయాలకు వర్తించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు హర్షం తెలిపారు. ఇక నుంచి ప్రతినెలా ఈ పథకం కింద ఆలయాల నిర్వహణకు రూ.5 వేలు విడుదల కానుండడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు కృతజ్ఞతగా అమలాపురంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ద్వారా ఆయా జిల్లాల ప్రతినిధులు సీఎం జగన్‌ను అభ్యర్థించగా ఆయన అంగీకరించి, పథకాన్ని అమలు చేస్తూ జీవో జారీ చేశారని జిల్లా సంఘం ప్రతినిధులు కట్టోజు సన్నయ్యదాసు, తాళాబత్తుల లక్ష్మణరావు, వీర్ని శేషుబాబు, భరణీకాన బాబు, డొంకాడ సాయి, వరదా సత్తిబాబు, బొల్లోజు శ్రీను, తాళాబత్తుల కొండ తదితరులు తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ఈ ప్రభుత్వ ఉత్తర్వులతో రాష్ట్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల నిర్వహణకు ఆర్థిక సమస్యలు ఉండవని వారన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌తో పాటు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు


ఆ మత్తులో పడకుండా..

- మాదక ద్రవ్యాల నియంత్రణకు యుద్ధం
- యువతను చైతన్యవంతం చేస్తున్న ఎస్‌ఈబీ
- నేడు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం
- తక్షణ సమాచారం, ఫిర్యాదులకు 14500 టోల్ ఫ్రీ నంబరు

అమలాపురం టౌన్: మాదక ద్రవ్యాలు మహమ్మారి లాంటివి. వీటికి ఒక్కసారి బానిసైతే ప్రాణాలు తీసే వదలవు.. ఇవే సమాజాన్ని పట్టిపీడిస్తాయి.. కుటుంబానికీ నరకం చూపిస్తాయి. అలాంటి మత్తు పదార్థాల నియంత్రణపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ప్రత్యక్ష యుద్ధం చేస్తోంది. జిల్లాలో గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు తాగుతున్న.. అక్రమంగా తరలిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ మత్తును చిత్తు చేసేందుకు చైతన్యపూరిత కార్యక్రమాలు చేపడుతోంది. ముఖ్యంగా యువత మత్తుకు బానిస కాకుండా జిల్లాలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తోంది. గంజాయి వాసన వస్తే చాలు ఎస్‌ఈబీ స్పందించి కేసుల నమోదు చేసి నిందితులను జైళ్లకు పంపిస్తోంది. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకొంటున్న నేపథ్యంలో జిల్లా ఎస్‌ఈబీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వచ్చింది. ప్రధానంగా కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తుంది. ముఖ్య కూడళ్లు, కళాశాలల ప్రాంగణాల్లో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, శిక్షలు వివరిస్తూ చైతన్యవంతంగా 72 హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్య ప్రతినిధులతో సదస్సులు నిర్వహించి చైతన్యం తీసుకువస్తోంది. అలాగే యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి వాటితోనే స్వీయ పరిరక్షణ చేయిస్తోంది. మాదక ద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ఈ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహిస్తోంది. యువతపైనే ప్రత్యేక దృష్టి పెట్టి వారిలో ఏ ఒక్కరూ మత్తుకు బానిసలు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. కళాశాలల్లో డ్రాప్ అవుట్స్, ప్రవర్తన సరిగా లేని విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తుంది. వారి తల్లిదండ్రులకు జాగ్రత్తలు చెబుతోంది.



అమలాపురం మిరియాం కళాశాలలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు



ఎక్కడికక్కడే ఉక్కుపాదం...

గతప్రభుత్వంలో జిల్లాలో గంజాయి ఉనికి ఉన్నా అంతగా పట్టించుకోకపోవడంతో అనివార్యమైన అనర్థాల కొనసాగింపు జరుగుతోంది. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎస్‌ఈబీ అనే ప్రత్యేక నిఘా సంస్థను ఏర్పాటు చేసి గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఈబీ జిల్లా ఇన్‌చార్జి ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా మత్తు పదార్థాల నివారణపై జల్లెడ పడుతున్నారు. ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడే అక్రమార్కులు, అసాంఘిక శక్తుల భరతం పడుతున్నారు. పదే పదే గంజాయి తదితర మత్తు పదార్థాల కేసులు నమోదైన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నారు. మాదక ద్రవ్యాల సమాచారం ఇచ్చేందుకు, ఫిర్యాదులు చేసేందుకు ప్రభుత్వం 14500 టోల్ ఫ్రీ నంబరు 24 గంటలూ అందుబాటులోకి తీసుకువచ్చింది.

31 కేసులు.. 136 మంది అరెస్ట్

గంజాయి నియంత్రణకు జిల్లా ఎస్‌ఈబీ నిరంతర నిఘాతో దాడులు నిర్వహిస్తోంది. ఈ ఏడాది మరింత కట్టుదిట్టం చేసింది. జిల్లాలో ఈ ఏడాది గంజాయి అక్రమ రవాణా, కలిగి ఉండడం, సేవనపై 31 కేసులు నమోదు చేసి 136 మందిని అరెస్ట్ చేసి జైళ్లకు పంపించింది. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న 39 వాహనాలను, 3,364 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసింది.

నియంత్రణపై నిరంతర నిఘా



జిల్లాలో గంజాయి నియంత్రణపై నిరంతర నిఘా పెట్టాం. దీనివల్ల యువత బానిస కాకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకుంటూ అవగాహన సదస్సులు, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆరోగ్యకర సమాజం ఆవిష్కరణకు నేటి యువత భాగస్వామ్యం కావాలి. జిల్లాలో కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎస్‌ఈబీ ప్రయత్నాలకు తోడవుతున్నారు. డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కున్న వారికి కఠినమైన సెక్షన్లతో కేసులు ఉంటాయి. బంగారు భవిష్యత్ నాశనం కాకుండా ఉండాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

– ఎస్.ఖాదర్ బాషా, ఏఎస్పీ, ఎస్‌ఈబీ జిల్లా ఇన్‌చార్జి

నేటి నుంచి రెండు పూటలా పాఠశాలలు

రాయవరం: పాఠశాలలు సోమవారం నుంచి రెండు పూటలా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. కాగా ఎండల ఉధృతి నేపథ్యంలో ఈ నెల 24వ తేదీ వరకూ ఒంటిపూట బడులు నిర్వహించారు. ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొనడం, నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు పడటంతో తిరిగి పూర్తి స్థాయిలో పాఠశాలలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలో ఉన్న 1,579 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, 541 ప్రైవేట్ పాఠశాలలు రెండు పూటలా నిర్వహించాల్సి ఉంటుంది. రెండు పూటలా పాఠశాలలు కచ్చితంగా పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి ఆదివారం మండల విద్యాశాఖాధికారులు, పాఠశాలల హెచ్ఎంలకు నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ నిర్వహించాలని అన్నారు.

ఉత్సాహంగా తైక్వాండో కలర్ బెల్ట్ ఎగ్జామ్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో సంఘం ఆధ్వర్యాన ఆదివారం తైక్వాండో బెల్ట్ ఎగ్జామ్ ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీనగర్ కార్పొరేషన్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పరీక్షలకు పిఠాపురం, కాకినాడ, అన్నవరం నుంచి 250 క్రీడాకారులు హాజరయ్యారు. ఎల్లో నుంచి రెడ్–1 వరకూ కలర్ బెల్ట్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో థియరీ, ప్రాక్టికల్, సెల్ఫ్ డిఫెన్స్‌లో క్రీడాకారులు పోటీ పడ్డారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిఠాపురం: స్థానిక శివారు అగ్రహారం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పిఠాపురం పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం పొన్నాడకు చెందిన పి.నాగేశ్వరరావు (62) పిఠాపురం అగ్రహారంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం అగ్రహారం వద్ద 216 జాతీయ రహదారి దాటుతుండగా కాకినాడ నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న వ్యాన్ ఢీకొంది. తీవ్ర గాయాలైన నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. పట్టణ ఎస్సై జగన్ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



కొత్తపల్లి: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం శ్రీరాంపురం శివారు పాటివారిపాలేనికి చెందిన పాటి శ్రీనివాస్‌కు కాకినాడ రూరల్ మాధవపట్నానికి చెందిన రూపాదేవి (29)తో 2015లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంత కాలంగా శ్రీనివాస్ తన భార్య రూపాదేవిని వేధిస్తుండడంతో ఆదివారం తెల్లవారుజామున ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై ఇన్‌చార్జి ఎస్సై ఎ.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల బదిలీలు పూర్తి

రాయవరం, బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పూర్వపు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 2008, 1998 డీఎస్సీ మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. ఈ నెల 24న రాత్రి ప్రారంభమైన కౌన్సెలింగ్ 25 వేకువ జాము వరకు కొనసాగింది. కాకినాడ సర్వశిక్షాభియాన్ సమావేశపు హాలులో ఆఫ్‌లైన్ విధానంలో డీఈఓ కేఎస్‌పీఎస్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు. 2008 డీఎస్సీకి చెందిన 199 మంది, 1997 డీఎస్సీకి చెందిన 265 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ ద్వారా వారికి కావాల్సిన పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. బదిలీల్లో కోరుకున్న స్థానాలు పొందిన ఉపాధ్యాయులు వెంటనే ఆయా స్థానాల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది.

నిత్య సేవ... ఆధ్యాత్మిక తోవ

- ధార్మిక, సేవలకు ప్రాధాన్యం
- అన్నవరం దేవస్థానం పెద్దపీట
- ఏటా రూ.పది కోట్ల ఖర్చు



ఈఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సేవా, ధార్మిక కార్యక్రమాల ఫ్లెక్సీ

అన్నవరం: ధార్మిక, భక్తుల సేవలతో రత్నగిరి దేవస్థానం తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటోంది. విద్య, అన్నదాన, ఆధ్యాత్మిక ఇలా అనేక కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతోంది.. ఏటా రూ.10 కోట్ల వరకూ వెచ్చిస్తూ నిత్య సేవలతో ముందుకు సాగుతోంది.. రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఖ్యాతికెక్కింది. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న ఈ దేవస్థానం సేవా, ధార్మిక కార్యక్రమాలు విరివిరిగా నిర్వహిస్తుంది. ఈ విషయం భక్తులకు తెలపాలని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించడంతో పలుచోట్ల ఈ మేరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అన్నదాన, గోసంరక్షణ పథకానికి గాను దేవస్థానానికి భక్తుల నుంచి విరాళాలు వస్తుండగా, మిగిలిన వాటికి దేవస్థానం స్వచ్ఛందంగా ఖర్చు చేస్తోందని ఈఓ తెలిపారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

దేవస్థానంలో రోజూ సుమారు నాలుగు వేల మందికి అన్నదానం చేస్తున్నారు. ఏడాది పాటు ఒక భక్తునికి భోజనం పెట్టేందుకు రూ.10,950 అవుతోంది. ఏటా ఇలా రూ.4.32 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ పథకానికి భక్తులు ఇచ్చిన విరాళాలు రూ.20 కోట్ల పైబడి ఉన్నాయి. ఏటా రూ.మూడు కోట్ల విరాళాలు వస్తున్నాయి.

పులిహోర, దద్ధోజనం వితరణ

సత్యదేవుని దేవస్థానానికి వచ్చే భక్తులకు రోజూ ఉదయం పులిహోర, దద్ధోజనం పంపిణీ చేస్తున్నారు. రోజుకు సుమారు వెయ్యి మందికి రూ.14,974 ఖర్చు అవుతోంది. ఇలా ఏటా సుమారు రూ.54 లక్షల వ్యయం అవుతోంది.

మజ్జిగ వితరణకు..

ఏటా వేసవిలో మజ్జిగ వితరణకు సుమారు రూ.28.60 లక్షలు అవుతోంది. ఒక రోజుకు రూ.7,890 ఖర్చు కాగా రోజు సరాసరిన నాలుగు వేల మందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

గో సంరక్షణకు రూ.72 లక్షలు

సత్యదేవుని గోశాల, రత్నగిరిపై గోకులంలో ఉన్న 194 గోవులకు మేత, దాణా, వాటి సంరక్షణకు ఏటా సుమారు రూ.72 లక్షలు అవుతోంది. ఒక్క ఆవుకు ఏడాదికి రూ.40 వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. మొత్తం 194 గోవులను దేవస్థానం సంరక్షిస్తోంది.

స్మార్త ఆగమ పాఠశాలకు..

సత్యగిరిపై స్మార్త ఆగమ పాఠశాల నిర్వహణకు



రత్నగిరిపై అన్నదాన పథకంలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



ఏటా సుమారు రూ.18.25 లక్షలు ఖర్చు చేస్తున్నారు. 28 మంది విద్యార్థులు ఆగమ విద్య అభ్యసిస్తున్నారు. ఒక్క విద్యార్థికి ఏడాదికి రూ.65 వేలు ఖర్చు చేస్తున్నారు. స్మార్త ఆగమ పాఠశాల భవనాలను రూ.ఐదు కోట్లతో నిర్మించి గతేడాది ప్రారంభించారు. సత్యదేవ ఉచిత వైద్యశాల నిర్వహణకు రూ.37.20 లక్షలు ఖర్చు చేస్తున్నారు.

విద్యా సంస్థలకు..

అన్నవరం దేవస్థానం మూడు విద్యా సంస్థలను నిర్వహిస్తోంది. ఇందులో దేవస్థానం హైస్కూల్‌కు రూ.42.10 లక్షలు, జూనియర్ కళాశాలకు రూ.95.47 లక్షలు, డిగ్రీ కళాశాలకు రూ. 1.75 కోట్లు ఖర్చు చేస్తుంది. హైస్కూల్‌లో విద్యార్థులు 82, జూనియర్ కళాశాలలో 435, డిగ్రీ కళాశాలలో 543 మంది విద్యనభ్యసిస్తున్నారు.



దేవస్థానం భూమిలో మారేడు మొక్కలు నాటుతూ..

దత్తత ఆలయాలకు..

కోరుకొండలోని లక్ష్మీనృసింహస్వామివారి దేవస్థానం, గెద్దనాపల్లిలో వేణుగోపాల స్వామివారి ఆలయం, శంఖవరంలోని మల్లేశ్వరస్వామివారి ఆలయం, ఉప్పలపాడు వేంకటేశ్వరస్వామి ఆలయం, ఏలేశ్వరం సత్యనారాయణ స్వామివారి ఆలయాలను అన్నవరం దేవస్థానం దత్తత తీసుకుని నిర్వహిస్తోంది. దీనికి గాను ఏటా రూ.60 లక్షలు ఖర్చు చేస్తుంది.

భూముల ఆదాయం రూ.15 లక్షలు

దేవస్థానానికి 772.40 ఎకరాల భూమి ఉంది. ఇందులో 616 ఎకరాలు కొండ కాగా, మెట్టభూమి 82 ఎకరాలు, పల్లపుభూమి 73 ఎకరాలు. ఈ భూమి ద్వారా దేవస్థానానికి ఏటా రూ.15 లక్షల ఆదాయం వస్తోంది. 66 ఎకరాలలో మారేడు వనాలను పెంచాలనేది లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 12.15 ఎకరాలలో 1020 మారేడు మొక్కలు నాటారు. ఇంకా 54 ఎకరాలలో ఐదు వేల మొక్కలు నాటాల్సి ఉంది. ఒక మొక్క కొనుగోలుకు రూ.530 అవుతుండగా, పెంచడానికి ఒక మొక్కకు ఏడాది కి రూ.రెండు వేలు ఖర్చు చేస్తున్నారు. ఇలా పదేళ్ల పెంచాల్సి ఉంది.

'డయల్ యువర్' ఈఓ రద్దు

అన్నవరం: రత్నగిరి దేవస్థానంలో సోమవారం 10.30 నుంచి 11.30 గంటల వరకూ జరగాల్సిన డయల్ యువర్ ఈఓ కార్యక్రమం రద్దయ్యింది. ఆలయ ఈఓ చంద్రశేఖర్ అజాద్ విజయవాడ క్యాంపులో ఉండడంతో కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమం ఎప్పుడు జరిగేది త్వరలోనే ప్రకటిస్తారని చెప్పారు.

తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



క్యాడెట్, జూనియర్స్ తైక్వాండో ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులతో డాక్టర్ లక్ష్మి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తూర్పు గోదావరి జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేశారు. స్థానిక ఇండియన్ ఇంజినీర్స్ భవన్‌లో జరిగిన ఎంపికలను శ్రావణి హాస్పిటల్ ఎండీ డాక్టర్ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మరక్షణకు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ప్రతిఒక్కరికీ అవసరం అన్నారు. తైక్వాండో కోచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ క్యాడెట్, జూనియర్స్ బాలురు, బాలికల విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. క్యాడెట్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులు జూలై 1, 2 తేదీలలో చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. విజయనగరం జిల్లాలో జూనియర్స్ విభాగంలో జూలై 15, 16 తేదీలలో పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రాయుడు లక్ష్మణ్, శ్రీను, సతీష్, ఈశ్వరి, బద్రి, శ్రీను, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

అన్నవరం: స్థానిక వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నిర్వహిస్తున్న స్మార్త, ఆగమ పాఠశాలలో 2023–24 స్మార్త ఆగమ కోర్సులో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల కోర్సులో చేరేందుకు ఈ నెల 27వ తేదీ నుంచి జూలై తొమ్మిదో తేదీ వరకూ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ పాఠశాల కార్యాలయంలో దరఖాస్తులు ఉచితంగా పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూలై పదో తేదీలోగా కరస్పాండెంట్, వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆగమ పాఠశాల, అన్నవరం, కాకినాడ జిల్లా, 533406 అనే చిరునామాకు పంపించాలన్నారు. విద్యార్థి వయసు తొమ్మిదేళ్ల నుంచి 13 ఏళ్ల మధ్యలో ఉండాలన్నారు. విద్యార్థి చదివి, రాయగలిగి, స్వచ్ఛమైన ఉచ్చారణ కలిగి ఉండాలన్నారు. కమిటీ సభ్యులు విద్యార్థి సర్టిఫికెట్ల పరిశీలన చేసి తర్వాత రిజిస్టర్ పోస్టు ద్వారా ఇంటర్వ్యూ తేదీ తెలియజేస్తారని అన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఐదేళ్ల పాటు వసతి, దుస్తులు, భోజన సౌకర్యం, నెలకు రూ.500 స్టైఫండ్ (బ్యాంకులో జమ) అందజేస్తారు. కోర్సు పూర్తయ్యాక స్టైఫండ్, దానిపై వడ్డీ విద్యార్థికి ఇస్తారు. వివరాలకు 77298 65645, 94918 81308 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గోదావరి తీరం.. నృత్య సోయగం

- ముగిసిన కళా సమ్మేళనం 2023
- నృత్య రూపకాలతో అలరించిన కళాకారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గోదావరి తీర ప్రాంతంలో రెండు గంటల పాటు సాగిన బృందావనం నృత్య రూపకం ఆహుతులను అలరించింది. బృందావనమది అందరిది.. గోవిందుడు అందరివాడేలే అంటూ గోపికలు కృష్ణుని వద్ద చేరి ఆనంద పరవశంతో నృత్యం చేశారు. కృష్ణుడు తనకి మాత్రమే సొంతం అంటూ రాధ నాట్యం చేయగా, కృష్ణుడు ఆట పట్టించే ఘట్టం అందరినీ మంత్రముగ్ధులను చేసింది. చూడచక్కని అభినయంతో చిన్నారులు కృష్ణునిగా, రాధగా, గోపికల వేషధారణతో నృత్యం చేస్తుంటే ప్రేక్షకులు తన్మయత్వం చెందారు. కళాసమ్మేళనం 2023 పేరిట రాజమహేంద్రవరంలోని శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సంగీత, నృత్య పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. 22న ప్రారంభించిన ఈ కార్యక్రమంలో తొలిరోజే నాలుగు ప్రపంచ రికార్డులు నమోదు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కూడా కళాకారులు హాజరయ్యారు. నాలుగు రోజుల పాటు సాగిన ఈ పోటీల్లో 756 మంది కళాకారులు సంగీత, నృత్య, జానపద పోటీలలో పాల్గొన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, యూత్ విభాగాలలో కూచిపూడి, ఆంధ్రనాట్యం, జానపదం, శాస్త్రీయ సంగీతంలో గాత్రం, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, లైట్ మ్యూజిక్, సెమీ క్లాసిక్‌లో 100 మందిని విజేతలుగా ప్రకటించారు. పది మందికి స్పెషల్ జ్యూరీ అవార్డులు ప్రదానం చేశారు. ప్రఖ్యాత నాట్యకారిణి శోభానాయుడు ప్రథమ శిష్యురాలు డాక్టర్ యశోద ఠాకూర్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ పి.సత్యవేణి చేతుల మీదుగా విజేతలకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు జీబీ నారాయణ, కుశల్ భట్టాచార్య, ఉమాజయశ్రీ, పోతిన శ్రీనివాస్, వై.వాణి తదితరులు పాల్గొన్నారు. హనుమాన్ చాలీసా కోసం 100 మంది నృత్య కళాకారులకు ఆరు నెలలుగా శిక్షణ ఇచ్చానని నాట్యకారిణి లక్ష్మీ దీపిక తెలిపారు. వరల్డ్ రికార్డ్స్ కోసం ఎక్కడా ఏ తప్పు లేకుండా నాట్యం చేయగలిగామన్నారు.



బృందావనం నృత్యరూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు



రాధగా అభినయిస్తున్న నాట్యకారిణి

న్యాయ నిర్ణేతగా ఉండడం కష్టం

చిన్నారులు ఎంతో కష్టపడి నాట్యసాధన చేస్తారు. పోటీలలో కొంత భయంతో కొన్ని భంగిమలు మరిచిపోతారు. అందరూ బాగా చేసినప్పటికీ ఉత్తమమైన విజేతలుగా వారినే ప్రకటించాలి. యూఎస్ఏ, సిమ్లా, డెహ్రాడూన్, జయపూర్ వంటి చోట్ల న్యాయ నిర్ణేతగా వ్యవహరించాను. కళాకుంజ్, కళావైభవ్, అభినయ గురుశ్రీ, ఆటా అవార్డు, అంతర్జాతీయ ఉత్తమ కూచిపూడి నృత్య దర్శకురాలిగా అవార్డులను తీసుకున్నాను.

– జి.ఉమాజయశ్రీ, నాట్యగురువు, రాజమహేంద్రవరం

ముగిసిన మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీలు



వివిధ విభాగాల్లో బహుమతులు సాధించిన కాకినాడ జిల్లా క్రీడాకారులతో అతిథులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాసకుమార్, గౌరవ అతిథిగా అలయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ అలై వి.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో విజేతలు జాతీయస్థాయిలో కూడా రాణించాలన్నారు. పోటీలు విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు. రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూలైలో అహ్మదాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టును త్వరలో ప్రకటిస్తామన్నారు. లేజర్ రన్ విభాగంలో విశాఖ, కాకినాడ, చిత్తూరు, భయాథ్లాన్ విభాగంలో కాకినాడ, విశాఖ, చిత్తూరు, ట్రైయాథ్లాన్‌లో విశాఖ, కాకినాడ, చిత్తూరు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి కోటపాటి కృష్ణ, కాకినాడ జిల్లా కోచ్ కట్టా జగన్మోహన్, నిర్వహణా కార్యదర్శి ఉపేంద్రనాథ్, స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు అలై కిరణ్‌కుమార్, అలయన్స్ క్లబ్ కోశాధికారి అలై సతీష్, డీఎస్ఏ కోచ్ రాజాషేక్, వెంకటరమణ పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడిన యువకుడు

- రెండు కాళ్లూ కోల్పోయిన వైనం



ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన ప్రయాణికుడు నరేష్



నరేష్ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ: రైలు ఎక్కుతూ జారిపడి తన రెండు కాళ్లూ ఓ యువకుడు కోల్పోయాడు. ఈ ఘటన రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి విజయనగరం వరకూ ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అంజనాపురం గ్రామానికి చెందిన దుహారి నరేష్ (26) ఇంటర్వ్యూ నిమిత్తం జనరల్ బోగీలో ప్రయాణిస్తున్నాడు. అయితే రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వచ్చేసరికి జనరల్ బోగీ ఇబ్బందికరంగా ఉండటంతో ఏసీ బోగీ ఎక్కేందుకు నిర్ణయించుకున్నాడు. తన లగేజీ తీసుకుని ఏసీ బోగీ ఎక్కే సమయంలో రైలు కదలడంతో నరేష్ ప్రమాదానికి గురయ్యాడు. నడుస్తున్న రైలు కింద పడిపోవడంతో నరేష్ రెండు కాళ్లపై నుంచి రైలు చక్రాలు ఎక్కడంతో నుజ్జునుజ్జయ్యాయి. రైల్వే అధికారులు, పోలీసులు వెంటనే స్పందించి ప్రమాదం బారిన పడిన నరేష్‌ను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యులు యువకుడికి రెండు కాళ్లూ తొలగించారు. యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

మీరే బలం... బలగం

- వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేద్దాం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలు, నాయకులే బలం.. బలగమని.. పార్టీని రెండోసారి అధికారంలోకి తీసుకు రావడానికి సైనికుల్లా చిత్తశుద్ధితో పనిచేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టడానికి రానున్న పది నెలలూ పార్టీ అన్ని అనుబంధ విభాగాల నాయకులు కష్టంచి పని చేయాలని అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం సంహిత కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ సేవాదళ్ (రీజినల్) మండల కన్వీనర్ల సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకైనా అనుబంధ విభాగాలు అత్యంత కీలకమని, అలాగే వైఎస్సార్ సీపీ అన్ని అనుబంధ విభాగాలను గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ బలోపేతం చేయడంపై ముఖ్యమంత్రి, పార్టీ పెద్దలు నిర్ణయించారన్నారు. వైఎస్సార్ సీపీకి సంబంధించి సేవాదళ్ అత్యంత కీలకమైన అనుబంధ విభాగమన్నారు. ఈ సమావేశానికి హాజరైన వారంతా ఒక్కో మండలానికి ప్రాతినిధ్యం వహిస్తున్నందున రానున్న కాలంలో గ్రామ స్థాయి నుంచి సేవాదళ్‌ను బలోపేతం చేయాలని కోరారు. సేవాదళ్ రీజినల్ అధ్యక్షుడిగా ఉన్న చినిమిల్లి వెంకట్రాయుడు పట్టుదల, నిబద్ధత కలిగిన వ్యక్తి అన్నారు. నామినేటెడ్ పదవి వద్దని, పార్టీకి సేవ చేసే పదవి కావాలని కోరుకున్న వ్యక్తి అని కొనియాడారు. పార్టీ మనుగడ సుస్థిరంగా ఉండాలంటే క్షేత్రస్థాయి నుంచి సంస్థాగతంగా బలపడాలన్నారు. దీనికి సేవాదళ్ నేతలంతా తమవంతు పాత్ర నిర్వర్తించాలని విజ్ఞప్తి చేశారు. మండల సేవాదళ్ అధ్యక్ష పదవి తేలికగా తీసుకోవద్దని, అందించే సేవలను బట్టి పదవులు వాటంతటవే వస్తాయని గుర్తుంచుకోవాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు డాక్టర్ బాబు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు మంగళంపల్లి అంజిబాబు, పశ్చిమగోదావరి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బల్లే ఏసుబాబు, ఏలూరు జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు భలే నాగరాజు, కాకినాడ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, ఐదు జిల్లాల మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

సాంకేతికతతో విద్యారంగం అభివృద్ధి

- ఆంధ్రా ఎలక్ట్రికల్స్ సీఈఓ శ్రీధర్



ముగింపు సదస్సులో పాల్గొన్న ప్రతినిధులతో ఆదిత్య సిబ్బంది

గండేపల్లి: సాంకేతికత ఆధారంగా విద్యా రంగాన్ని అభివృద్ధి చేయాలని ఆంధ్రా ఎలక్ట్రికల్స్ సీఈఓ కె.శ్రీధర్ అన్నారు. సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఐఈఈఈ విశాఖ బే సెక్షన్‌తో కలసి అడ్వాన్స్‌డ్ గ్లోబల్ ఇంజినీరింగ్ చాలెంజెస్ (ఏజీఈసీ)పై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి ఇంజినీర్లు కొలువుల కోసం ఎదురు చూడకుండా ఇన్నోవేషన్‌పై దృష్టి సారించాలన్నారు. వక్తలు మాట్లాడుతూ ఇటువంటి కాన్ఫరెన్స్‌లతో నేటి ఇంజినీరింగ్ సవాళ్లను అధిగమించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. యువత పరిశోధనల ద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించాలన్నారు. ఆదిత్యలో ఈ రకమైన ఐఈఈఈ కాన్ఫరెన్స్ మొదటిదన్నారు. ఈ సదస్సులో పవర్ ఎలక్ట్రానిక్స్, మొబైల్ రోబోలు, మెషీన్ లెర్నింగ్, ఇమేజ్ ఫ్యూజన్, ఎంబెడెడ్ సిస్టమ్, 5జీ కమ్యూనికేషన్స్ విభాగాల్లో పేపర్లు సమర్పించారు. 34 మంది పరిశోధకులు తమ పత్రాలు సమర్పించారు. డీన్ డాక్టర్ కేవీఎస్ఆర్ మూర్తి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఐటీ జంషెడ్‌పూర్, జాదవ్‌పూర్ విశ్వ విద్యాలయం, ఎస్ఆర్ఎం, వీఐటీ చండీఘడ్ విశ్వవిద్యాలయం, ఎన్‌టీకేఆర్ విద్యానగర్, గీతం, ఎస్ఆర్ విశ్వవిద్యాలయం, వరంగల్, న్యూహారిజన్ బంగ్లోర్, నియోటియా విశ్వవిద్యాలయం నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, దోలా సంజయ్, ఆదిరెడ్డి రమేష్, డీన్‌లు ఎం.రమశ్రీ, కేవీఎస్ఆర్ మూర్తి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.